## క్లుప్తంగా

### మున్సిపల్ అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు

తూప్రాన్: మున్సిపల్ అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికతో వార్డుల వారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ అన్నారు. శనివారం పట్టణంలోని 5, 2 వార్డుల్లో ఆ వార్డుల కౌన్సిలర్లు ప్రియాంక, మామిడి వెంకటేశ్‌లతో కలిసి అండర్‌గ్రౌండ్, సీసీ రోడ్ల పనులను శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు వెంకటేశ్, రఘుపతి, కృష్ణ, సత్యలింగం, తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్షలు శనివారం నాటికి 41వ రోజుకు చేరుకున్నాయి. మూడు రోజులుగా పట్టణ ముదిరాజ్ సంఘం సభ్యులు దీక్షలో కూర్చుంటున్నారు. డివిజన్ సాధించే వరకు తాము దీక్షలు విరమించమని వారు స్పష్టం చేశారు. ఈ దీక్షలకు వ్యాపార, యువజన, కుల సంఘాల వారు తమ మద్దతు ప్రకటించారు.

### సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

నర్సాపూర్: తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లోని గిరిజన గురుకుల పాఠశాల, కాలేజీలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపులో విద్యార్థులు పాల్గొంటున్నారని పాఠశాల ప్రిన్సిపాల్, క్యాంపు కోఆర్డినేటర్ భిక్షమయ్య అన్నారు. శనివారం సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో ఆయన హాజరై మాట్లాడారు. క్యాంపులో విద్యతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కోఆర్డినేటర్ చార్లెస్, ఇతర అధ్యాపకులు వెంకటయ్య, సుదీంధ్ర, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



అక్కంపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని అక్కంపల్లి, హకీంపేట గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ స్వరూప, జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ విఠల్, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఎంపీఓ విఘ్నేశ్వర్, గిర్దావర్ ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభమైన వీరభద్రుడి జాతర



అభిషేకానికి నీటిని తీసుకెళ్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి ఉత్సవాలు శనివారం ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. వేడుకలో భాగంగా వీరభద్రుడికి అభిషేకం చేశారు.

### అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరావాలి

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 7వ మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లిలో అంబేడ్కర్ విగ్రహంతో పాటు బాబు జగ్జీవన్‌రాం, మహాత్మ జ్యోతి బాపూలే తదితర 12మంది మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు అభిమానులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ కోరారు. ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్, అద్దంకి దయాకర్ తదితరులు విగ్రహావిష్కరణ చేయనున్నారని చెప్పారు.

# వర్షంతో తడిసిన ధాన్యం



శివ్వంపేటలో మొలకెత్తిన ధాన్యం



ధర్మాసాగర్‌లో వరద నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం

కౌడిపల్లి(నర్సాపూర్): అకాల వర్షంతో వరి కుప్పలు తడిసిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రం కౌడిపల్లితో పాటు వివిధ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో కౌడిపల్లి, ధర్మాసాగర్, వెల్మకన్న, కొట్టాల, మహ్మద్‌నగర్, పాంపల్లి తదితర గ్రామాల్లో వర్షంతో వరిధాన్యం తడిసిపోయాయి. ధర్మాసాగర్ కొనుగోలు కేంద్రం వద్ద రైతులు కుప్పలుగా పోసినా భారీ వర్షం రావడంతో గ్రామానికి చెందిన చంద్రం, బోయిని పుండరీకం, శాగ రాజు, రాజాగౌడ్ తదితర రైతుల ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వం స్పందించి, తడిసిన ధాన్యం సైతం కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గాను రైతులకు తీవ్రనష్టం చేకూర్చింది. చేతికి వచ్చిన పంట చేజారిపోవడంతో రైతులు కంటతడి పెట్టారు. ఆరబోసేందుకు కల్లాల వద్దకు తీసుకొచ్చిన ధాన్యం ఎండ రాకపోవడంతో మొలకలు వస్తున్నాయి. నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికీ తూకం వేయడం లేదని రైతులు ఆరోపించారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభించేదెప్పుడో?

ప్రమాదకరంగా మురికి కాల్వలు



పాత బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు నిలిచిపోయిన సీసీ రోడ్డు పనులు



నిజాంపేటలో ప్రమాదవశాత్తు మురికి కాల్వలో పడిన వ్యక్తి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో పాత బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు సీసీ పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు శనివారం ఒక ద్విచక్రదారుడు ప్రమాదవశాత్తు అదుపు తప్పి మురికి కాల్వలో పడడంతో తీవ్రగాయలు అయ్యాయి. ఈ విషయమై గ్రామస్తులు తీవ్ర అసంపూర్తికి గురవుతున్నారు. రెండు నెలల క్రితం మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి చేతుల మీదుగా పాత బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఇందులో భాగంగా పాత బస్టాండ్ నుంచి గాంధీ విగ్రహం వరకు ఇరు వైపులా మురికి కాల్వపై ఉన్న పై కప్పును తొలగించారు. తర్వాత మురికి కాల్వలపై సీసీరోడ్డు నిర్మించిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. కానీ నేటికి కాల్వలపై కప్పులు లేకపోవడంతో వినియోగదారులకు, ప్రయాణికులకు ఇబ్బంది మారింది. దీనిపై అధికారులను, కాంట్రాక్టర్ వివరణ కోరగా.. నిధులు సరిగా విడుదల చేయకపోవడంతో పనులు మొదలు కావడంలేదని వాపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



రేగోడ్(మెదక్): వెంకటాపూర్‌లో..

కౌడిపల్లి(నర్సాపూర్): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని తునికిలో రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు, ఉపసర్పంచ్ మానిక్యరెడ్డి, నల్లపోచమ్మదేవి ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐ సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రతీ ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన ధ్రువపత్రాలు లేని 65 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 1 కారును సీజ్ చేశారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు రూ.69 వేలను విరాళం ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, టేక్మాల్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలి



జెడ్పీ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందిస్తున్న కాళ్లకల్ మైనార్టీ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మైనార్టీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలతను కాళ్లకల్ మైనార్టీ నాయకులు శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలోని కాళ్లకల్ గ్రామానికి చెందిన మైనార్టీలు మండల కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసి మైనార్టీ భవన నిర్మాణం కోసం నిధుల మంజూరుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి, ఆత్మకమిటీ డైరెక్టర్ భిక్షపతి, నాయకులు నాగరాజు, శైలేందర్, బాబాగౌడ్, రతన్‌లాల్, మండలం మైనార్టీ నాయకులు ఇర్ఫాన్, గ్రామ మజీద్ కమిటీ సదర్ ముస్తాఫా, నాయిబ్ సదర్ ఆసిఫ్, క్యాషియర్ ఇర్ఫాన్, నాయకులు ఉమర్, జావీద్ తదితరులున్నారు.

## సంక్షిప్త వార్తలు

◆ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా యాదగిరి



రామాయంపేట(మెదక్): రామాయంపేట లయన్స్ క్లబ్ (320డి) అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దేమె యాదగిరి ఎన్నికయ్యారు. టీవీపీ చారి అధ్యక్షతన స్థానిక మోహర్‌సాయి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వంగరి కై లాసం, కోశాధికారిగా లక్ష్మణ్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా దారం రమేశ్, శేషాచారి, పీఆర్‌ఓగా శ్రీనివాస్, డీసీగా ఏలేటి రాజశేఖర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.


◆ పింఛన్ మంజూరు పత్రం అందజేత

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని పర్కిబండ గ్రామానికి చెందిన బౌరంపేట లక్ష్మికి వితంతు పింఛన్ మంజూరు పత్రాన్ని శనివారం స్థానిక నాయకులు అందజేశారు. నాయకులు ఆంజనేయులు, రాములు, నర్సింలు, కిష్టయ్య, అశోక్, శ్రీశైలం, బుచ్చయ్య, మహేశ్, కృష్ణ తదితరులున్నారు.

◆ పోకిరిలు హద్దు మీరితే కఠిన చర్యలు

చేగుంట(తూప్రాన్): రైళ్లలో పోకిరి పనులు చేసే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటామని రైల్వే సీఐ సుబ్బారెడ్డి అన్నారు. మండల కేంద్రం మాసాయిపేటలోని శ్రీనివాసనగర్ రైల్వే స్టేషన్‌ను సీఐ పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మధుసూదన్‌రెడ్డితో గ్రామ పంచాయతీ వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైళ్లపై రాళ్లదాడి, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించినా వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాలపై ఫిర్యాదులు చేస్తే వెంటనే స్పందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

◆ ఎమ్మెల్సీని కలిసిన కురుమ సంఘం నేతలు



మెదక్‌జోన్: కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మల్లేశం పుట్టినరోజు సందర్భంగా మెదక్ కురుమ సంఘం విద్యార్థి హాస్టల్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ఎల్లయ్య శనివారం హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కురుమ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

### ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు రూ.2.50లక్షల చెక్కును అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ శనివారం అందజేశారు.

### ఘనంగా బోనాలు



బోనాలతో గిరిజనులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి బతుకమ్మ తండాలో నూతనంగా నిర్మించిన జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద తండావాసులు శనివారం బోనాలను ఊరేగించి అమ్మవారికి సమర్పించారు.

### జెత్రంతండా పంచాయతీ కార్యాలయానికి తాళం



పంచాయతీ కార్యాలయానికి తాళం వేసిన సర్పంచ్

చేగుంట(తూప్రాన్): జూనియర్ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమ్మెకు మద్దతుగా మండలంలోని జెత్రం తండా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసి, సర్పంచ్ మద్దతు ప్రకటించారు. పంచాయతీ కార్యదర్శులు తమను ఉద్యోగులుగా గుర్తించాలని చేస్తున్న సమ్మెకు మద్దతుగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి తాళం వేసినట్లు సర్పంచ్ మాలీ గణేశ్ తెలిపారు.

### 'పనులు చేయించుకున్నారు పైసలివ్వలేదు'

పాపన్నపేట(మెదక్): మొక్కలకు పాదులు తీయించుకొని ఫారెస్ట్ అధికారులు డబ్బులు ఇవ్వట్లేదని కూలీలు ఆరోపించారు. మండలంలోని కొడుపాక, గాజులగూడెం శివారులోని అడవిలో గతేడాది డిసెంబర్‌లో మొక్కలకు పాదులు చేసేందుకు 130 కూలీలు పని చేశారని చెప్పారు. ఇందు కోసం గుత్తగా రూ.70 వేలు మాట్లాడుకున్నామన్నారు. అయితే పనులు చేసిన తర్వాత సెక్షన్ ఆఫీసర్ రమేశ్ రూ.22 వేలు ఇచ్చి మిగతా డబ్బులు తర్వాత ఇస్తామని చెప్పి, ఆరు నెలలవుతున్నా.. ఇప్పటి వరకు ఇవ్వలేదని వాపోయారు. అయితే లక్ష్మీనగర్‌లోని ఒక ఫైనాన్స్ నుంచి రూ.50 వేలు అప్పుగా తెచ్చి లేబర్‌కు ఇచ్చానని వాచర్ మల్లేశం తెలిపారు. ఇదే విషయమై సెక్షన్ ఆఫీసర్ రమేశ్‌ను వివరణ కోరగా.. మొక్కలకు పాదులు చేయడం, కొమ్మలు కత్తిరించడం తదితర పనుల కోసం కొడుపాకకు చెందిన కూలీలను నియమించాం. వారు సరిగా పనులు చేయక పోవడంతో కొత్తపల్లి, అన్నారం గ్రామ కూలీలను పిలిపించి పనులు చేయించి వారికి డబ్బులు చెల్లించాం. కొడుపాక గ్రామ కూలీలకు కూడా వారు చేసిన పనులకు రూ. 22 వేలు చెల్లించాం.

### బీఆర్‌ఎస్ పాలనలో ఉద్యోగాలు లేవు

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో ఉద్యోగాలు లేవని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టోజిపల్లి గ్రామంలో శనివారం ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు వీధుల్లో పర్యటించి ప్రజాసమస్యలను గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువకులతో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, నవీన్, ఆంజనేయులు, స్టాలిన్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## అన్ని కులసంఘాలకు సమాన ప్రాధాన్యం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



నీలికులసంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని కుల సంఘాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ సమాన ప్రాధాన్యం కల్పిస్తున్నారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దశంకరంపేటలో ప్రియాంక కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయానికి శంకుస్థాపనతో పాటు నీలికుల సంఘం, పద్మశాలి సంఘం నూతన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మురళిపంతులు, సర్పంచ్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, సీనియర్ నాయకులు ఆర్‌ఎస్.సంతోష్, ఎంపీటీసీలు వీణసుభాష్‌గౌడ్, స్వప్నరాజేష్, వార్డు సభ్యులు రామకృష్ణాగౌడ్, నాయకులు వంశీ, లక్ష్మణ్, యాకుబ్, శంకర్‌గౌడ్, నారాయణ, ప్రియాంక కాలనీ అధ్యక్షుడు ఫణిందర్, బాలకిషన్, ఆయా కుల సంఘాల నాయకులు గుజ్జరి కనకరాజు, జశ్వంత్, శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు

ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



చేగుంట శివారులో రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): గ్రామాల్లోని అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరీ చేయిస్తానని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కర్నాల్‌పల్లి సాయిబాబా ఆలయం వద్ద కిచెన్‌షెడ్ నిర్మాణానికి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గ్రామాల్లోని అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక నిధులు మంజూరీ చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్నాల్‌పల్లి కిచెన్‌షెడ్ కోసం రూ. 5లక్షలు, ఎస్సీ కమ్యూనిటీ భవనం కోసం రూ.5లక్షలు, బోనాల్ ముదిరాజ్ కమ్యునిటీ హాల్ కోసం రూ. 5లక్షల రూపాయల ప్రొసిడింగ్‌లను సంబంధిత గ్రామ సర్పంచ్‌లు బీఆర్‌ఎస్ నాయకులకు అందించారు. అనంతరం చేగుంట నుంచి బోనాల్ చౌరస్తా వరకు జరుగుతున్న రోడ్డు మరమ్మతు పనులను ఎంపీ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, సర్పంచ్‌లు సంతోష్‌రెడ్డి, కుమ్మరి శ్రీనివాస్, అబ్రమైన మల్లయ్య సహకారక సంఘం చైర్మన్ కొండల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు రామాగౌడ్, విశ్వేశ్వర్‌రావు, రమేశ్‌తో పాటు పలు గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సేవ కార్యక్రమాలు గుర్తింపునిస్తాయి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రజల కోసం నిర్వహించే సేవా కార్యక్రమాలు గుర్తింపునిస్తాయని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. శనివారం శివ్వంపేట పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి జన్మదినం సందర్భంగా కొంతన్‌పల్లి గ్రామంలో రక్తదాన శిబిరం ప్రారంభించడంతో పాటు యువకులకు క్రీడా సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జన్మదినం సందర్భంగా సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా ప్రజలకు లబ్ధిచేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా, జెడ్పీ కో ఆప్షన్ మన్సూర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పిట్ల సత్యనారాయణ, బండారి గంగాధర్, నాగేశ్వర్‌రావు, జగన్‌రెడ్డి, శ్రీనివాస్, మన్నే నర్సింలు, శ్రీనివాస్‌గౌడ్, సంతోశ్ తదితరులు ఉన్నారు.

## పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మహిళలతో మాట్లాడుతున్న సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): గర్భిణులు, బాలింతలు సరైన పోషకాహారం భుజిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శనివారం ఆమె మండల పరిధిలోని గౌతాపూర్ -1 అంగన్‌వాడీ కేంద్రంలో వీహెచ్‌ఎస్‌ఎన్‌డీ(విలేజ్ హెల్త్, శానిటేషన్, న్యూట్రిషన్ డే) కార్యక్రమంలో భాగంగా తల్లులకు పోషణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంతోషిమాత మాట్లాడుతూ.. వీఎస్‌హెచ్‌ఎన్‌డీ రోజు అంగన్‌వాడీ కేంద్రంలో 0 - 5 సంవత్సరాల పిల్లల బరువు, ఎత్తు పరిశీలించి, వారి పోషణ స్థాయి గురించి తల్లులకు తెలియజేయాలన్నారు. 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లలకు ప్రతీ నెల 2.5 కిలోల బాలామృతం, 16 గుడ్లు ఇవ్వాలన్నారు. వీహెచ్‌ఎస్‌ఎన్‌డీ 2వ రోజు అర్హులైన పిల్లలకు, గర్భిణులకు టీకాలు ఇవ్వాలని, అదేవిధంగా నూతన గర్భిణులను నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప, అంగన్‌వాడీ టీచర్, ఏఎన్‌ఎం ఆశ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## బిల్లులు విడుదల చేయాలి



బిల్లులు విడుదల చేయాలని ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్‌లు

రామాయంపేట(మెదక్): గ్రామాల అభివృద్ధికి అప్పులు చేసి పనులు చేశామని, వాటి బిల్లులు వెంటనే విడుదల చేయాలని శనివారం రామాయంపేట మండల సర్పంచ్‌లు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సొంత డబ్బులతో పాటూ అప్పులు చేసి పనులు చేశామని కానీ తమకు బిల్లులకు సంబంధించిన పైసలు త్వరగా చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు నర్సాగౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ యువజన అధ్యక్షుడు ఉమామహేశ్వర్, రామాయంపేట మండలంలోని 15 గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## చాకరిమెట్లలో భక్తజన సందడి



సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తున్న భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని చాకరిమెట్ల అరణ్యంలో కొలువైన సహకార ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తజన సందడి నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సత్యనారాయణస్వామి మండపంలో సామూహిక వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో ఈఓ శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆంజనేయశర్మ, ప్రధాన అర్చకులు దేవదత్తశర్మ, అర్చకులు దేవిశ్రీ, ప్రభుశర్మ, శ్రీవాత్సవ్, సిబ్బంది శ్రీనివాస్, రామకృష్ణ ఉన్నారు.

## 'నిరుద్యోగ మార్చ్'కు తరలిరావాలి



నర్సాపూర్: మాట్లాడుతున్న నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్

నర్సాపూర్: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 11న సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్లేశ్‌గౌడ్ కోరారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల పార్టీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మిలియన్ మార్చ్‌పై చర్చించారు. సమావేశంలో జిల్లా పార్టీ కార్యదర్శి సురేష్, నాయకులు సగేష్‌గౌడ్, రాజు, సంజీవరెడ్డి, సురేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో బీజేపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ జిల్లా అధికారిక ప్రతినిధి నందారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, చంద్రశేఖర్, శంకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి నరేష్ మహంకాళి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కిషన్ నాయక్, జిల్లా నాయకులు శ్రీనివాస్, బూత్ అధ్యక్షులు కుమార్, రాజు, ప్రశాంత్, పోచయ్య, లారా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపన్నపేట(మెదక్): ఈనెల 11న సంగారెడ్డిలో తలపెట్టిన నిరుద్యోగ మార్చ్ ర్యాలీ జయప్రదం చేయాలని బీజేపీ మండలాధ్యక్షుడు సంతోష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ హాజరయ్యే ఈ మార్చ్‌కు ఉమ్మడి జిల్లా నుంచి నిరుద్యోగ యువతీ యువకులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 11న సంగారెడ్డిలో నిర్వహించే నిరుద్యోగ మిలియన్ మార్చ్‌కు తరలి రావాలని బీజేపీ మండల ఇన్‌చార్జ్, నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ రాజేందర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. శనివారం కౌడిపల్లిలో ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు రాకేశ్, నాయకులు శాగరాజు, సుధాకర్, కొండల్, బీరప్ప, శేఖులు, సతీష్, మోమిన్, నాగరాజు, నర్సింలు, విష్ణు, సాయికుమార్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.